- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
14-04-2026

సంపుటి : 01 సంచిక : 23 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :23 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha



## ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..

- ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు
- పునరాలోచనలో ట్రంప్

న్యూఢిల్లీ, 13ఏప్రిల్.(మహాప్రభ
అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమైన దరిమిలా ఇరాన్‌పై మళ్లీ యుద్ధానికి ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) సిద్ధమవుతున్నట్లు మూడు ప్రధాన హిబ్రూ టీవీలు సోమవారం వెల్లడించాయి. ఈ సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా ఇజ్రాయెల్ రక్షణ అధికారులు లీక్ చేసినట్లు తెలుస్తున్నది. రెండు వారాల కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన వారం లోపలే ఈ పరిణామం చోటుచేసుకుంటున్నది. పశ్చిమాసియాలో యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఉద్దేశించి పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో ఇస్లామాబాద్‌లో 21 గంటలపాటు జరిగిన శాంతి చర్చలు విఫలమైన తర్వాత 48 గంటల్లోనే మళ్లీ ఇరాన్‌తో తలపడేందుకు ఐడీఎఫ్ సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి.ఇరాన్‌తో మళ్లీ యుద్ధాన్ని పునరుద్ధరించేందుకు సన్నాహాలు చేపట్టాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్

-మిగతా 3 లో

### భూ పరిపాలనకు కొత్త దిక్సూచి

# భూభారతి

**చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి**

- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్
- పాతసర్వే పద్ధతులకు స్వస్తి
- రోవర్లతో సర్వే ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**3.80లక్షల మందికి పాస్‌బుక్‌ల జారీ**



హైదరాబాద్ 13ఏప్రిల్. (మహాప్రభ
ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో

-మిగతా 3 లో



### అంగన్వాడీ టీచర్లకు

## స్మార్ట్ ఫోన్లు

- వికలాంగులకు ట్రై సైకిళ్లు
- మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ
- ఫోన్‌ల కొనుగోళ్లలో అక్రమాలు లేవన్న తుమ్మల

ఖమ్మం 13ఏప్రిల్. (మహాప్రభ
సంక్షేమ పథకాల అమలు, మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ సందర్భంగా మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. అంగన్వాడీల సేవలు అమూల్యమని, రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. '

-మిగతా 3 లో

## తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

- వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు
- ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడత ప్రక్రియ
- అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి




హైదరాబాద్, 13ఏప్రిల్. (మహాప్రభ
రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026–27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది.

-మిగతా 3 లో

### మహిళా రిజర్వేషన్లతో

# పునర్విభజన లింక్

**ఇందులో బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉంది**

- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, 13ఏప్రిల్. (మహాప్రభ
మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారంమహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.


-మిగతా 3 లో

**పునర్విభజనను రాజకీయపావుగా వాడుకుంటున్న మోడీ**



## టేబుల్ టాపర్‌ను వణికించిన సన్‌రైజర్స్

- ఉప్పల్‌లో కుప్పకూలిన రాజస్థాన్ రాయల్స్.
- రాజస్థాన్‌కు ఈ సీజన్‌లో తొలి ఓటమి రుచి చూపించిన సన్‌రైజర్స్.
- ఒకే ఓవర్లో మూడు వికెట్లతో చరిత్ర సృష్టించిన ప్రఫుల్ హింగే
- నిలబడ్డ జడ్డూ, ఫెరీరా.. కానీ దక్కని ఫలితం
- 57 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘనవిజయం.



న్యూఢిల్లీ13ఏప్రిల్.(మహాప్రభ
పంతొమ్మిదో సీజన్‌లో వరస ఓటములకు సన్‌రైజర్స్ హైదరాబాద్ గుడ్ బై చెప్పేసింది. సొంత గడ్డపై అదరగొట్టిన ఆరెంజ్ ఆర్మీ టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్ ను చిత్తుగా ఓడించింది. ఇషాన్ కిషన్(91) బ్యాటుతో విధ్వంసం సృష్టిస్తే.. కుర్ర పేసర్లు ప్రఫుల్ హింగే(4-34), షకీబ్ హుస్సేన్(4-24)లు రాజస్థాన్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రఫుల్ ఒకే ఓవర్లో మూడు వికెట్లతో టాపార్డర్‌ను కూల్చగా.. టెయిలెండర్లను హుస్సేన్ మడతపెట్టేశాడు. అంతే.. సన్‌రైజర్స్ జట్టు ఉప్పల్ మైదానంలో సగర్వంగా, సంబురంగా గెలుపు తోవ తొక్కింది.ఐపీఎల్‌లో బ్యాటర్లనే నమ్ముకొనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఈసారి బౌలర్లు గెలిపించారు. ఈ సీజన్‌లో ఓడిన మూడు మ్యాచుల్లో బౌలర్లే విలన్లు.. కాగా ఉప్పల్ స్టేడియంలో మాత్రం పోటీపడి వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓటమి రుచి చూపించారు. 217 పరుగుల ఛేదనలో తొలి ఓవర్లోనే ప్రఫుల్ హింగే (4-34) మూడు వికెట్లతో చరిత్ర సృష్టించాడు. మొదటి బంతికే వైభవ్ సూర్యవంశీ(0)ని బోల్తా కొట్టించాడీ కుర్రాడు. పెద్ద షాట్ ఆడాలనుకున్న వైభవ్ బంతిని వికెట్ల వెనకాల గాల్లోకి లేపగా..

-మిగతా 3 లో

## నేడు బీహార్ సీఎం ఎన్నిక..

- బీజేపీ నుంచి తొలి ముఖ్యమంత్రి!



పాట్నా 13ఏప్రిల్. (మహాప్రభ
బీహార్‌కు తమ పార్టీ నుంచి మొదటి ముఖ్యమంత్రి ఎవరవుతారనేది మంగళవారం తేలనుందని ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు సోమవారం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇందుకోసం కేంద్ర పరిశీలకుడిగా వస్తారని.. ఆయనే ముఖ్యమంత్రి ఎవరో వెల్లడిస్తారని వారు చెప్పారు. మంగళవారం చివరి క్యాబినెట్

-మిగతా 3 లో

## నన్ను ఓడించేందుకు కేంద్రం, 19 రాష్ట్రాలు ఏకం

- సీఎం మమతా బెనర్జీ



3

## రాష్ట్రం నిప్పుల కొలిమి..

- అన్ని జిల్లాల్లోనూ 41 డిగ్రీలకు పైగా
- వచ్చే మూడ్రోజులు మరింత ఎండలు
- అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- 19 నుంచి 45 డిగ్రీలు దాటే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక




3

## హెర్ముజ్ దిగ్బంధం..

**ఇరాన్ రేవులకు నౌకల రాకపోకలు బంద్**

- అమల్లోకి ట్రంప్ ఆదేశాలు
- భారీగా బలగాలను మోహరించిన నౌకాదళం
- మా జోలికొస్తే పర్షియన్ గల్ఫ్‌లోని ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదు
- యూఎస్‌కు ఇరాన్ వార్నింగ్





టెహ్రాన్, 13ఏప్రిల్. (మహాప్రభ
ఇరాన్‌తో కీలక చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా విఫలమైన తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన హెర్ముజ్ జలసంధి ద్వారా ఇరాన్ ఓడరేవులను కలిపే సముద్రమార్గాన్ని అమెరికా నౌకాదళం దిగ్బంధించడం ప్రారంభిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం చేసిన ప్రకటన అమలులోకి వచ్చింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్ ఓడ రేవుల్లోకి రాకపోకలు సాగించే నౌకలను లక్ష్యంగా చేసుకుని

-మిగతా 3 లో

## మహిళా రిజర్వేషన్లపై రేవంత్‌కు అవగాహన లేదు

- పార్లమెంట్ చర్చలో ఎంపీలు ఎవరైనా మాట్లాడవచ్చు
- రేవంత్ ఎక్స్ పోస్ట్‌పై కిషన్ రెడ్డి అభ్యంతరం


హైదరాబాద్ 13ఏప్రిల్. (మహాప్రభ
మహిళా రిజర్వేషన్లపైన సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు మాట్లాడవచ్చని వెల్లడించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని



-మిగతా 3 లో

# హెర్మూజ్‌లో భారత నౌకలపై టోల్ వసూలు చేయలేదు

**ఇరాన్ రాయబారి వెల్లడి**



**న్యూఢిల్లీ, 13ఏప్రిల్.(మహాప్రభ ).**
హెర్మూజ్ జలసంధి నుంచి వెళ్తున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజునూ వసూలు చేయటం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నామని, ఇరు దేశాలు ఉమ్మడి ప్రయోజనాలు, భవిష్యత్ కలిగి ఉన్నాయని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలీ అన్నారు. సోమవారం ఆయన న్యూఢిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ, 'హెర్మూజ్‌లో భారత చమురు ట్యాంకర్లపై టోల్ ఫీజు విధించ లేదు.అంతర్జాతీయ చట్టాలకు, స్వేచ్ఛాయుత నౌకాయానానికి ఇరాన్ కట్టుబడి ఉంది. హెర్మూజ్ జలసంధి మా ప్రాదేశిక జలాల్లో ఉంది. సమీప భవిష్యత్తులో దీనిపై ఎలాంటి విధానం అనుసరిస్తామన్నది అన్ని దేశాలకూ తెలిపాం' అని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, తమ షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు ఉంటాయని అన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి


**-సిపిఎం జిల్లా నేత ఏ. మల్లేశం**




**మెదక్ జిల్లా 13ఏప్రిల్.(మహాప్రభ ).**
విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు ఆరవరోజైన సోమవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఆర్టిజన్లకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, 2026 పిఆర్సి,మెడికల్ లీవులు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.గ్రేడ్ చేంజ్,పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టిజన్ నిరవధిక సమ్మెకు సిపిఎం జిల్లా నాయకులు ఏ.మల్లేశం హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ ల పట్ల గత టిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలు ఒకేలా ఉన్నాయనియనీ రోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం కల్పించుకుని తమకు రావాల్సిన న్యాయ పరమైన అన్ని హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు ప్రణీత,స్వప్న,జ్యోతి,సుమలత, మానస,నాగమణి జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్, శ్రీశైలం,శ్రీనివాస్,బి.చంద్ర భానప్ప, నాగరాజు, వెంకటచారీ,రాజుగౌడ్, మొగులయ్యా, బుస్ససత్యం గుప్తా,రమావత్ హరినాయక్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్, కిషన్, అశోక్, మోహన్,పరశురామ్,నర్సింలు, సుధాకర్, సాయిలు, యాదగిరి,సూర్య రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్,గంగారం,తదితరులు పాల్గొన్నారు.కాగా ఆరవరోజు మెదక్ డివిజన్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మహిళా మావోయిస్టు ఎన్‌కౌంటర్

**మృతురాలు తెలంగాణకు చెందిన రూపీ**



**కొత్తగూడెం ప్రగతి మైదాన్, 13ఏప్రిల్.(మహాప్రభ ).**
: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు కమాండర్ మృతిచెందారు. మాచ్‌పల్లి, ఆరమ్‌ర్ఘూర్ హిదూర్ అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు.ఇరువర్గాల మధ్య భీకరపోరు జరిగినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతిచెందింది. మృతురాలు మావోయిస్టు పార్టీ ప్రతాప్‌పూర్ ఏరియా కమిటీ సభ్యురాలు, కమాండర్ రూపీగా గుర్తించినట్లు కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ అశోక్ కాఖేచ తెలిపారు. రూపీ తెలంగాణ ప్రాంతానికి చెందిన మహిళగా, ఆమె తెలుగు రాష్ట్రాల నుంచి బస్తర్ రేంజ్ పరిధిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న చివరి కార్యకర్తగా ప్రకటించారు.


# డొనాల్డ్ ట్రంప్‌నకు బ్రిటన్ షాక్..

**హోర్ముజ్ దిగ్బంధానికి మద్దతు ఇవ్వబోమని స్పష్టం**



**న్యూఢిల్లీ, 13ఏప్రిల్.(మహాప్రభ ).**
హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. అయితే, ఈ విషయంలో అమెరికా మిత్ర దేశంగా పేరున్న బ్రిటన్ షాకిచ్చింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. ఈ విషయంలో తాము ట్రంప్‌నకు మద్దతు ఇవ్వడం లేదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం బీబీసీతో మాట్లాడారు.హోర్ముజ్‌ను దిగ్బంధించాలంటూ అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తమ దేశం ఉద్రిక్తతలు పెరగాలని కోరుకోదని, స్థిరత్వానికే ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన నౌక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసేయకుండా, సురక్షితంగా నౌకలు రవాణా జరిగేలా చూడాలన్నారు. హోర్ముజ్‌ను సైనిక చర్య ద్వారా అడ్డుకోవడంకన్నా, దీన్ని పూర్తిస్థాయిలో ఎలా అందుబాటులోకి తీసుకురావాలో ప్రయత్నించాలని సూచించారు. తమ దేశ నావికా దళం ఇతర నౌకల్ని, మార్గాల్ని అడ్డుకోవడం కన్నా.. సురక్షితంగా నౌకల రవాణా జరిగేలా చూడటం కోసమే పని చేస్తుందని స్టార్మర్ వివరించారు. అంతకుముందు కూడా కీర్ స్టార్మర్.. ఇరాన్ యుద్ధంపై స్పందించారు. తాము ఇరాన్ యుద్ధంలో అమెరికాతో కలిసి పాల్గొనడం లేదని తెలిపారు. సరైన ప్రణాళిక, చట్టపరమైన అవసరాలు లేకుండా యుద్ధంలోకి దిగబోమని చెప్పారు. భారీ యుద్ధంలో పాల్గొనడం కన్నా, జాగ్రత్తగా, స్వతంత్రంగా వ్యవహరించడమే ఈ పరిస్థితిల్లో మంచిది అని అభిప్రాయపడ్డారు. ఇక, హోర్ముజ్‌ను అమెరికా దిగ్బంధించే ప్రక్రియ భారత కాలమానం ప్రకారం రాత్రి ఏడున్నర గంటలకు మొదలవుతుంది.

# ట్రంప్ వర్సెస్ పోప్!



**వాటికన్ సిటీ 13ఏప్రిల్.(మహాప్రభ ).**
పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పోప్ లియో XIV మధ్య వివాదం ముదురుతున్నది. ట్రంప్ తనపై చేసిన విమర్శలను పోప్ సోమవారం తిప్పి కొట్టారు. శాంతి, సయోధ్య కోసం వాటికన్ చేస్తున్న విజ్ఞప్తులు సువార్త(జీసస్ బోధన) మూలాల్లోనే ఉన్నాయని తెలిపారు. తాను ట్రంప్ ప్రభుత్వానికి భయపడనని మీడియాతో అన్నారు. సువార్త సందేశాన్ని ట్రంప్ సరిగా అర్థం చేసుకోలేదని ఆయన వ్యాఖ్యానించారు.అయితే ప్రస్తుత ప్రపంచంలో చర్చి లక్ష్యం(శాంతి సందేశం) ఏమిటో చెప్పడం తాను కొనసాగిస్తానన్నారు. కొందరు సర్వ శక్తిమంతులమని భ్రమ పడుతున్నారని తాను చేసిన విమర్శ ట్రంప్ లేదా మరెవరిపై ప్రత్యక్ష దాడి కాదని అమెరికా నుంచి తొలిసారి పోప్ అయిన లియో తెలిపారు. తీవ్రవాద వామపక్షాలను ప్రసన్నం చేసుకోవడం పోప్ ఆపాలని, ఆయన మంచి పని చేయడం లేదని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పోప్ ఈ విధంగా స్పందించారు.

# యూకేలో శాశ్వత నివాసానికి పదేండ్లు!



**లండన్ : న్యూఢిల్లీ, 13ఏప్రిల్.(మహాప్రభ ).**
శాశ్వత నివాస నిబంధనలను యూకే కఠినతరం చేయనున్నది. ఆ దేశ హోం మంత్రి షబానా మహమూద్ ఈ విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. శాశ్వత నివాసానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే వలసదారులకు ప్రస్తుతం ఉన్న 5 ఏండ్ల నివాస గడువును పదేండ్లకు పెంచనున్నట్టు చెప్పారు. మరికొన్ని విభాగాల కింద వలసదారులు శాశ్వత నివాసం కోసం 20 ఏండ్లు ఎదురుచూడాల్సి రావొచ్చు. మరోవైపు శాశ్వత నివాస అర్హత నిబంధనలను కూడా యూకే కఠినతరం చేయనున్నది.దరఖాస్తుదారులకు ఎటువంటి నేర చరిత్ర ఉండకూడదు. ఆంగ్లభాషా నైపుణ్యం కూడా మెరుగ్గా ఉండాలి. గత మూడేండ్లుగా ఏటా 12,570 పౌండ్ల కంటే ఎక్కువగా సంపాదిస్తూ ఉండాలి. ఫుల్‌టైమ్ ఎంప్లాయ్‌మెంట్ అవకాశం తక్కువగా ఉన్నవారు, శరణార్థులు, ఫ్యామిలీ వీసాదారులు, వర్క్ వీసాలపై ఆధారపడిన వారిపై ఈ కొత్త నిబంధనల ప్రభావం అధికంగా ఉండనుంది. అయితే వ్యక్తిగత పరిస్థితుల ఆధారంగా పదేండ్ల బేస్‌లైన్ మారొచ్చని సమాచారం.

# బిజెపి ప్రభుత్వ హయాంలో అన్యాయం పరాకాష్టకు చేరింది



**నోయిడా 13ఏప్రిల్.(మహాప్రభ ).**
: నోయిడా ఫేజ్ 2లోని హోసియరీ కాంప్లెక్స్‌కు చెందిన కార్మికులు తమ జీతాన్ని పెంచమని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన చేపట్టారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుకునేందుకు శాంతియుతంగా నిరసన చేస్తున్న కార్మికుల్ని పోలీసులు అడ్డుకున్నారు. మహిళా ఉద్యోగినిపై లాఠీఛార్జ్ ప్రయోగించడంపై నిరసనకారులు పోలీసు వాహనాలకు, ప్రభుత్వ వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ ఘటనపపై సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ రాష్ట్ర యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్టంలో అన్యాయం పరాకాష్టకు చేరిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్టంలో అన్ని రకాల అన్యాయాలు జరుగుతున్నాయి. ఆర్థికంగా అన్యాయం జరుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల అన్యాయం జరుగుతుంది. అధికమవుతున్న నిరుద్యోగం వల్ల అన్యాయం జరుగుతోంది. ఈరోజు నోయిడాలో మనం చూసింది ఏమిటంటే.. కార్మికులు తమ హక్కులను పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు అని అఖిలేష్ ఎత్తిచూపారు. ఈ పరిస్థితికి పరిపాలన, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిలేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల్లో కార్మికుల జీతాలు పెంచినప్పుడు, ఉత్తర ప్రదేశ్‌లో ప్రభుత్వం ఎందుకు ఉపశమనం కల్పించడం లేదు అని అఖిలేష్ రాష్ట్ర ప్రభుతాన్ని ప్రశ్నించారు.


# రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

**ఎస్సై మధుకర్ రెడ్డి**



**శివంపేట, ఏప్రిల్ 13(మహాప్రభ):**
రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన 'డ్రైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ప్రమాదాలను అరికట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కమిటీలు అప్రమత్తంగా ఉండి రోడ్డుభద్రతకు కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజపేట వెంకటేష్, ఉప సర్పంచ్ ఈసుగారి మల్లేష్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు పాల్గొన్నారు.

# హజ్ యాత్ర వేళ ... మక్కా ప్రవేశంపై సౌదీ అరేబియా ఆంక్షలు



**సౌదీ అరేబియా , 13ఏప్రిల్.(మహాప్రభ ).**
హజ్ యాత్ర సీజన్ ప్రారంభమవుతున్న వేళ .... మక్కా నగర ప్రవేశంపై సౌదీ అరేబియా ప్రభుత్వం కీలక ఆంక్షలు విధించింది. (ఏప్రిల్ 13) నుండి అధికారిక అనుమతి పత్రాలు లేని విదేశీయులు, స్థానిక నివాసితులు ఎవరూ మక్కాలోకి ప్రవేశించకూడదని స్పష్టం చేసింది. యాత్రికుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రతను పర్యవేక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ వెల్లడించింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ....**
కేవలం మక్కాలో పని చేసే వర్క్ పర్మిట్ ఉన్నవారు, అక్కడ జారీ చేసిన రెసిడెన్సీ ఐడీ (ఇఖామా) కలిగిన వారు లేదా చెల్లుబాటు అయ్యే హజ్ పర్మిట్ ఉన్నవారిని మాత్రమే నగరంలోకి అనుమతిస్తారు. నిబంధనలను ఉల్లంఘించి వచ్చే వారిని సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్దే నిలిపివేసి వెనక్కి పంపేలా కఠిన చర్యలు చేపట్టారు.

**ఉమ్రా వీసాలపై వచ్చినవారికి 18 వరకు గడువు ....**
మరోవైపు ఉమ్రా వీసాలపై వచ్చిన విదేశీయులకు ఏప్రిల్ 18 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ లోపు వారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఏప్రిల్ 18 నుండి మే 31 వరకు 'నుసుక్' ప్లాట్‌ఫామ్ ద్వారా పౌరులు, జీసీసీ దేశాల వారికి ఇచ్చే ఉమ్రా పర్మిట్ల జారీని పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 18 తర్వాత కేవలం హజ్ వీసా ఉన్న వారిని మాత్రమే మక్కాలోకి అనుమతించనున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని సౌదీ ప్రభుత్వం హెచ్చరించింది. పవిత్ర హజ్ యాత్రను ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు యాత్రికులందరూ సహకరించాలని కోరింది.

## తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

మొదటి తరువాయి

సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## టేబుల్ టాపర్‌ను వణికించిన సన్‌రైజర్స్

మొదటి తరువాయి

వికెట్ కీపర్ సలీల్ అరోరా ఒడుపుగా అందుకున్నాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే ధ్రువ్ జురెల్(0)ను బౌల్డ్ చేశాడీ పేసర్.అంతేనా.. అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న ప్రిటోరియస్(0)ను ఔట్ చేసి రాజస్థాన్‌ను గట్టి దెబ్బ కొట్టాడు ప్రఫుల్. ఆ తర్వాతి ఓవర్లో యశస్వీ జైస్వాల్(1)ను షకీబ్ హుస్సేన్ ఔట్ చేయడంతో 2 పరుగులకే రాజస్థాన్ నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. ఇక ఆ జట్టు చిత్తుగా ఓడడం ఖాయమనుకున్న వేళ రవీంద్ర జడేజా(48), డొనొవాన్ ఫెరీరా(69) క్రీజులో పాతుకుపోయారు. సన్‌రైజర్స్ బౌలర్లను విసిగిస్తూ.. సింగిల్స్, డబుల్స్ దొంగిలించారు. కాస్త కుదురుకున్నాక గేర్ మార్చిన ఫెరీరా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని ఎట్టకేలకు ఫెరీరాను బౌల్డ్ చేసి విడదీశాడు హుస్సేన్. కాసేపటికే మలింగ ఓవర్లో జడ్డూ వెనుదిరిగాడు. మరోసారి బంతి అందుకున్న హుస్సేన్ రెండు వికెట్లు తీసినా.. ఆఖర్లో తుషార్ దేశ్‌పాండే(25) సిక్సర్లతో హోరెత్తించాడు. కానీ, మలింగ ఓవర్లో షాట్ గురి తప్పగా ఇషాన్ చేతికి చిక్కాడు. దాంతో.. రాజస్థాన్ 159కి కుప్పకూలగా 57 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపొందింది.

## నేడు బీహార్ సీఎం ఎన్నిక..

మొదటి తరువాయి

సమావేశం తర్వాత నితీశ్ తన పదవికి రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతున్నది.దీంతో బుధవారం కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ఉండొచ్చని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. శివరాజ్ సమక్షంలో తమ ఎమ్మెల్యేలు శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకుంటారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సంజయ్ సరయోగి మీడియాకు తెలిపారు. బీసీ లేదా దళితుడు బీజేపీ నుంచి సీఎం అవుతారని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తున్నది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కూడా పోటీలో ఉన్నారు.

## మహిళా రిజర్వేషన్లపై రేవంత్‌కు అవగాహన లేదు

మొదటి తరువాయి

కాంగ్రెస్‌ని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఎక్స్ పోస్టుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పరిపాలన చేసిందని.. అంబేద్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకో లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలన్న ఢిల్లీకి కట్టలు మోయాలని విమర్శించారు. బీజేపీ విధానం అది కాదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..

మొదటి తరువాయి

ఎయాల్ జమీర్ సైన్యాన్ని ఆదేశించినట్లు వైనెట్ న్యూస్ సైట్ ఆదివారం పేర్కొన్నది. ఇరాన్ నుంచి కూడా ఆకస్మిక దాడులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు సంసిద్ధంగా ఉండాలని కూడా జమీర్ సైన్యాన్ని ఆదేశించినట్లు చానెల్ న్యూస్ వెల్లడించింది. ఇలా ఉండగా హెర్మూజ్ జలసంధి దిగ్బంధంతోపాటు ఇరాన్‌పై పరిమిత సైనిక దాడులు పునరుద్ధరించే విషయాన్ని తన సలహాదారులు పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. యుద్ధాల పట్ల అసంతృప్తిగా ఉన్న ట్రంప్ ఇరాన్‌పై పూర్తి స్థాయి యుద్ధాన్ని తిరిగి ప్రారంభించే అవకాశం చాలా తక్కువని అమెరికన్ అధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ ఆదివారం పేర్కొన్నది.

## అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

మొదటి తరువాయి

అంగన్వాడీలకు రాజకీయాలతో పనిలేదు. పేద ప్రజలకు, చిన్నారులకు సేవ చేసే గొప్ప భాగ్యం మీకు దక్కింది. యూనియన్ల పేరుతో గొడవలు చేయడం వల్ల జీవితాలు బాగుపడవు, నిబద్ధతతో పనిచేస్తే మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అని మంత్రి చెప్పారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. నేరుగా కంపెనీ నుంచే అతి తక్కువ ధరకే ఫోన్లు కొనుగోలు చేశామని, పారదర్శకత కోసమే ఈ డిజిటల్ విప్లవాన్ని అంగన్వాడీల్లో ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలకు కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నామని, గతంలో తానే మంత్రిగా ఉన్నప్పుడు రెండుసార్లు జీతాలు పెంచిన విషయాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాల'లో భాగంగా 500 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చును మంత్రి వివరించారు. డ్వాక్రా మహిళల కోసం ఈ ఏడాది 23 వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. పేదలందరికీ సన్నబియ్యం అందించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని మంత్రి కోరారు. ఖమ్మం జిల్లాలో 3,000 మంది పిల్లలకు గురుకులాల్లో చదువుకునే అవకాశం ఉందని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి 1.50 లక్షల రూపాయలు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఉన్నత విద్య చదివిస్తేనే కుటుంబాలు పేదరికం నుంచి బయటపడతాయని ఆయన వెల్లడించారు.

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

మొదటి తరువాయి


. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మంత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు.. పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకురిజర్వేషన్లుతీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలోమహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు.

# హెర్మూజ్ దిగ్బంధం..

మొదటి తరువాయి

సోమవారం ఉదయం 10 గంటలకు(ఈఎస్ కాలమానం ప్రకారం) భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7.30 గంటలకు) ఈ దిగ్బంధం అమల్లోకి వచ్చింది. ఈ విషయాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌సహా ఇరాన్ ఓడరేవులు, తీర ప్రాంతాలను ఉపయోగించే అన్ని దేశాల నౌకలపైన నిష్పాక్షికంగా ఈ చర్యను అమలు చేస్తున్నట్లు సెంట్‌కామ్ తెలిపింది. అయితే అమెరికా సైన్యం జలసంధిని పూర్తిగా మూసివేయలేదు. ఇరానేతర ఓడరేవులకు రాకపోకలు సాగించే నౌకల నౌకాయాన స్వేచ్ఛ కొనసాగుతుందని పేర్కొన్నది. ప్రపంచ నౌకా రవాణా మార్గాలకు పూర్తిగా అంతరాయం కలిగించకుండా, ఇరాన్‌ను ఏకాకిని చేయడమే లక్ష్యంగా ఇది ఒక క్రమబద్ధమైన విధానాన్ని అనుసరిస్తోందని సెంట్‌కామ్ సూచించింది. ఇరాన్ ఓడరేవుల్లోకి రాకపోకలు సాగించే అన్ని నౌకలకు ఈ దిగ్బంధం వర్తిస్తుందని సెంట్‌కామ్ తెలిపింది. తమ ఆదేశాలను ఉల్లంఘించిన నౌకలను అడ్డుకోవడం లేదా స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని స్పష్టంచేసింది.

**ట్రంప్ తీవ్ర హెచ్చరికలు**



ఇరాన్‌కు చట్టవిరుద్ధమైన సుంకాలు చెల్లించే ఏ నౌక అయినా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ నౌకాదళానికి చెందిన 158 నౌకలు పూర్తిగా నాశనమై సముద్ర గర్భంలో కూరుకుపోయాయని, తాము దెబ్బతీయనవి వారి వద్ద ఉన్న ఫాస్ట్ అటాక్ షిప్స్ అని పిలుచుకునే కొద్ది సంఖ్యలోని నౌకలు మాత్రమేనని ట్రంప్ పేర్కొన్నారు. తాము వాటిని పెద్ద ముప్పుగా పరిగణించడం లేదని, అయితే ఈ నౌకలలో ఏవైనా తమ దిగ్బంధనానికి సమీపంలోకి వస్తే సముద్రంలో పడవల్లోని డ్రగ్స్ వ్యాపారులపై తాము ఉపయోగించే అదే విధ్వంసక పద్ధతిని ఉపయోగించి వాటిని తక్షణమే నిర్మూలిస్తామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా లేదా వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకునే ఇరాన్ బలగాలపై తీవ్ర ప్రతీకారం తీర్చుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. మాపై గాని, శాంతియుక నౌకలపై గాని కాల్పులు జరిపే ఏ ఇరానీయుడినైనా తునాతునకలు చేస్తాం అని ట్రంప్ పేర్కొన్నారు.

**మీరు పోరాడితే.. మేమూ పోరాడుతాం..**

ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ వేగంగా స్పందించింది. హెర్మూజ్ జలసంధి సమీపంలో ఏ విదేశీ సైనిక ఉనికి అయినా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లుగానే పరిగణిస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) హెచ్చరించింది. ఇరాన్ రేవులు, తీర ప్రాంతాలపై సోమవారం నుంచి దిగ్బంధం అమలు చేస్తామని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో తమ రేవులకు ముప్పు వాటిల్లిన పక్షంలో పర్షియన్ గల్ఫ్ లేదా ఒమన్ సముద్రంలోని ఏ ఓడరేవు కూడా సురక్షితంగా ఉండబోదని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ప్రాంతీయ సముద్ర భద్రతను అందరూ పంచుకోవాలి. పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలో భద్రత అందరి కోసం లేదా ఎవరి కోసం కాదు. ఈ ప్రాంతంలోని ఏ ఓడరేవు కూడా సురక్షితంగా ఉండదు అని ప్రకటించింది.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

మొదటి తరువాయి

భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం.ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం.మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం.

## రాష్ట్రం నిప్పుల కొలిమి..

-అన్ని జిల్లాల్లోనూ 41 డిగ్రీలకు పైగా
-వచ్చే మూడ్రోజులు మరింత ఎండలు
-అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
-19 నుంచి 45 డిగ్రీలు దాటే అవకాశం
-హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



**హైదరాబాద్,**

ఎండల తీవ్రతతో రాష్ట్రం నిప్పులకొలిమిలా మారింది. పెరిగిన ఎండలతోపాటు వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడ్రోజులుగా ఎండలకు భయపడి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. దీంతో మధ్యాహ్న సమయాల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో దాదాపు 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసినట్టు తెలిపింది.

## నన్ను ఓడించేందుకు కేంద్రం, 19 రాష్ట్రాలు ఏకం

**కోల్‌కతా**



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్, విపక్ష బీజేపీ మధ్య పోటీ నువ్వానేనా అన్నట్టుగా సాగుతున్నది. తాజాగా సీఎం మమతా బెనర్జీ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తనను ఓడించడానికి కేంద్రం, 19 రాష్ట్రాలు ఏకమయ్యాయని అన్నారు.సామాన్య ప్రజల కోసం తాను ఒంటిచేత్తో పోరాడుతున్నానని పేర్కొన్నారు. సోమవారం బీర్భుమ్ జిల్లాలో సురి ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ, ఢిల్లీ నుంచి బలగాలను దింపినంత మాత్రాన, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ గెలువలేదని ఆమె అన్నారు. తమ పార్టీ 226 స్థానాలకు మించి గెలుచుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# చట్టసభల్లో మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కేటాయించాలని డిమాండ్

## సామాజికవేత్త, శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ ఏప్రిల్ 13( మహాప్రభ )**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో పార్లమెంటులో మహిళా బిల్లుతోపాటు బీసీ మహిళలకు చట్టసభల్లో సబ్ కోట రిజర్వేషన్లను అమలు చేయాలని సంఘం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.దేశానికి స్వాతంత్రం వచ్చిన కాడి నుండి ఇప్పటివరకు మహిళలకు న్యాయం జరగలేదన్నారు .మహిళలు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలంటే మహిళలను చైతన్యం కావాలంటే మహిళలకు సమాజంలో గౌరవం దక్కాలంటే కచ్చితంగా పార్లమెంట్లో పాస్ అయినటువంటి మహిళా బిల్లుతో పాటు చట్టసభల్లో బీసీ మహిళలకు కూడా సబ్ కోట మహిళా బిల్లును పాస్ చేసి చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించినట్లయితే. మహిళా లోకాన్ని గౌరవించినట్లు అవుతుందని తక్షణమే మహిళలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేరి పెల్లి జయలక్ష్మి, ముత్తమ్మ, వనం చంద్రకళ, శారద, భీమ గాని శివ గౌడ్, శివ మాలిక్ మొదలగు బీసీ సంఘం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతపై గ్రామ సభల నిర్వహణ





- -క్షేమంగా ఇంటికి చేరడమే "అరైవ్ అలైవ్" లక్ష్యం
- -ప్రజల్లో ట్రాఫిక్ అవగాహన పెంపొందించడమే లక్ష్యం
- -జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండలాల్లో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు
- -ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం -- రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం
- - జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపిఎస్

**కామారెడ్డి ఏప్రిల్ 13 (మహాప్రభ)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా "అరైవ్ అలైవ్" భాగంగా రోడ్డు రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టుతున్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం మరియు ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పోలీస్, రవాణా, ఆర్ ఌ బి, విద్య, వైద్య శాఖల సమన్వయంతో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు విస్తృత స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగవాన్, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రణాళికలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసుల పర్యవేక్షణలో ప్రతి మండలం, గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలు గ్రామ స్థాయిలో పనిచేస్తూ ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేసి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపడతాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో కమిటీ సభ్యులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, నిర్ణీత వేగ పరిమితుల పాటింపు, మద్యం సేవించి వాహనం నడపకూడదనే విషయాలపై ప్రజల్లో చైతన్యం కల్పించినట్లు చెప్పారు. కమిటీ సభ్యులకు వారి విధులు వివరించి, గ్రామ స్థాయిలో రహదారి భద్రతపై అవగాహన పెంచడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా ప్రజల్లో బాధ్యతతో డ్రైవింగ్ చేసే అలవాటును పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని వెల్లడించారు.ఏప్రిల్ 13 నుండి 18 వరకు కొనసాగుతున్న ఈ అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు అయి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ కోరింది.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం





**తాడ్వాయి ఏప్రిల్ 13 (మహాప్రభ)**
కన్కల్ గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ, వాహనదారులు హెల్మెట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, సూచించారు. ఉప సర్పంచ్ చాకలి మహేందర్, ప్రజలకు రోడ్డు భద్రతపై జాగ్రత్తలు తెలియజేశారు. పోలీస్ కానిస్టేబుల్ నిరంజన్ గౌడ్, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించి, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రవర్తించాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ విక్రాంత్ గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రతిజ్ఞ చేశారు.

# SPR స్కూల్లో ఫేర్వెల్ డే




**దేవరకొండ ఏప్రిల్ 13 ( మహాప్రభ )**
స్థానిక ఎస్పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. తమతో కలుసుకొని చదువుకున్న విద్యార్థులు నేటినుండి 10వ తరగతి ముగించుకొని వెళ్ళిపోతున్న సందర్భంగా ఒకరికొకరు హగ్ చేసుకొని కన్నీరు కారుస్తూ నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రావణ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని స్కూల్ లో నుంచి మీరు వెళ్లిపోయిన ఉన్నతమైన శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పేరెంట్స్ ని తోటి విద్యార్థి విద్యార్థులను ఆనందభాష్పాలతో వర్ధిల్ల చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని సంతోషించారు

# జనగణన కోసం సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి

## -జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.



**మెదక్ జిల్లా -13ఏప్రిల్ (మహాప్రభ )**
జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్ వైజర్లు మరియు ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు సోమవారం హైదరాబాద్ నుండి కులగణన సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు నిర్వహించబడనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్లను నియమించామని ఆయన వివరించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగనన సూపరింటెండెంట్ గఫార్ , ఈడియం సందీప్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీ

## -ఏవో రాజలింగం



**ఏప్రిల్ 13 (మహాప్రభ)**
గాంధారి మండల కేంద్రంలో గల ఎరువుల దుకాణాలను సోమవారం ఏవో రాజలింగం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వలను పరిశీలించి స్టాక్ నమోదు పుస్తకాలను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని దుకాణదారులకు సూచించారు. నిర్ణయించిన పురుగుల మందు దుకాణాల్లో ఏవో రాజలింగం, నిల్వను రిజిస్టర్లను సరిచూసి తనిఖీ చేశారు.

# మహిళలకు ఆత్మరక్షణ విద్య కరాటే అత్యంత అవసరం....!





**దుబ్బాక - ఏప్రిల్ 13 (మహాప్రభ)**
శారీరక మానసిక దృఢత్వానికి కరాటే అత్యంత అవసరమని కరాటే మాస్టర్ బుర్రని శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్ లో యువర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలకు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, సకినాల లక్షిత, పరిశీలకులుగా వ్యవహరించారు. సిద్దిపేట, దుబ్బాక నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరులు 20 మంది విజేతలుగా నిలిచి సర్టిఫికెట్లు, బెల్టులు, సొంతం చేసుకున్నారు. విజేతలుగా బ్రౌన్ బెల్ట్ : ప్రజ్వల, హర్షవర్ధన్ బ్లూ బెల్ట్: నిశాల్,విశ్రుద్, చక్రధర్, గ్రీన్ బెల్ట్: ఆరోవ్ సర్వజ్ఞ, అక్షయ వర్ధన్ ఆరెంజ్ బెల్ట్ : ప్రచురిత, ప్రణవి, వశిష్ట, విశ్వతేజ్, సాత్విక్, హర్షిత, రిషిఅఖిల్, కళ్యాణ్ తేజ్, యెల్లో బెల్టు: అభిరామ్, అక్షర,మాయూక, హర్షిని ఈ కార్యక్రమం యువతలో ఆత్మరక్షణ భావనను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

# మాజీ జడ్పీటీసీ తేరా గోవర్ధన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

-గోవర్ధన్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి
-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఏప్రిల్ 13 (మహాప్రభ )**
పిఏపల్లి మాజీ జడ్పీటీసీ తేరా గోవర్ధన్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం పిఏపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ తేరా గోవర్ధన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ......గోవర్ధన్ రెడ్డి గారి ఆశయ సాధనకు కృషి చేయాలి అని ఆయన పిలపునిచ్చారు.గోవర్ధన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులే వచ్చి .. భద్రతలను వివరించి





**పాపన్నపేట, ఏప్రిల్ 13 ( మహా ప్రభ)**
రోడ్డు భద్రత నియమాలను పాటించాలని మెదక్ జిల్లా ప్రభుత్వ అధికారులు ప్రజలకు సూచించారు. సోమవారం కొత్తపల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి హాజరై అరైవ్ - అలైవ్ గూర్చి వివరించారు. వాహన చోదకులు శిరస్త్రాణం,సీటు బెల్ట్ ధరించాలన్నారు. రహదారిలో ప్రమాదం జరిగితే గోల్డెన్ అవర్ లో ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. ప్రాణాలు కాపాడిన వారికీ ఈ విషయంలో ప్రభుత్వం తగు మినహాయింపులు ఇచ్చిందన్నారు. ద్విచక్ర వాహనాలు,అతివేగం,ఆ జాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్టీసీ డిఎం సురేఖ,డిటిఓ వెంకట స్వామి,డిఎస్పీ ప్రసన్న కుమార్,సీఐ జార్జి,అబ్కారీ సీఐ నాగేశ్వర రావు,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,ఆర్ అండ్ బి డిఈ వెంకటేశం,ఏఈ రవి కుమార్,తహశీల్దార్ సతీష్ కుమార్,డిప్యూటీ తహశీల్దార్ చరణ్ సింగ్,పంచాయతీ కార్యదర్శి సంతోష్,సర్పంచ్ కుమ్మరి పద్మ జగన్నాథం,ఉపసర్పంచ్ రాము తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పై గుంతలు పూడ్చిన కానిస్టేబుల్



**నర్సాపూర్,ఏప్రిల్ 13 (మహాప్రభ):**
కౌడిపల్లి మండలం సలావత్పూర్ లో కానిస్టేబుల్ తన సేవా దృక్పథంతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. '99 రోజులు ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత అవగాహన కల్పిస్తూ, స్వయంగా రంగంలోకి దిగి రహదారిపై ఉన్న ప్రమాదకరమైన గుంతలను పూడ్చారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించి పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బైరి సత్తయ్య మృతి బాధాకరం

**-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ ఏప్రిల్ 13( మహాప్రభ)**
దేవరకొండ నియోజకవర్గంలోని పీఏ పల్లి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బైరి సత్తయ్య మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం పోతిరెడ్డిపల్లి గ్రామంలో సత్తయ్య మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సత్తయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్తయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన భగవంతుని ప్రార్ధించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు

**-డిసిసి కార్యదర్శి మెదక్ బుడ్డ భాగ్యరాజ్**



**తూప్రాన్ ఏప్రిల్ 13,(మహాప్రభ)**
ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదల, సమయపాలనతో సాధించిన ఈ విజయము మీ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది అని ఆయన అన్నారు.. విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలక పాత్ర పోషించిందని ,. పరీక్షల్లో విజయం సాధించిన ప్రతి విద్యార్థి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని, దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే, ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహ పడకుండా మరింత కృషి చేసి భవిష్యత్తులో విజయాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని బుడ్డ భాగ్యరాజ్ ఆకాంక్షించారు.


## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో

# పాల్గొన్న జెడ్పి సీఈవో.



**తూప్రాన్, ఏప్రిల్ 13.(మహాప్రభ)**
మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తూప్రాన్ పోలీస్ శాఖ వారు నిర్వహిస్తున్న ఆరైవ్ అలైవ్ కార్యక్రమానికి జెడ్పి సీఈవో ఎల్లయ్య ముఖ్య అతిథిగా అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా వాహనాలపై ప్రయాణించే వాహనాదారులు సీటు బెల్టు పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించుకొని వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్యంగా వాహనాలు నడిపే వాహనాదారులు మద్యం సేవించి వాహనాలను నడపరాదని పేర్కొంటూ ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వాలు రోడ్డు భద్రత విషయంలో చేపట్టిన నిబంధనలను ప్రతి ఒక్కరు బాధ్యతా యుతంగా పాటించాలని వివరించారు. ప్రమాదాలలో కుటుంబంలోని ఏ వ్యక్తి చనిపోయిన ఆ కుటుంబం పరిస్థితి అధోగతి పాలవుతుందని తెలుపుతూ ప్రభుత్వం సూచించిన ప్రతినిబంధనను ప్రతి ఒక్కరు పాటించి ప్రయాణాలు కొనసాగించాలని వివరించారు. ఇందులో ప్రభుత్వ దావకానా సుపరిడెంట్ డాక్టర్ అమర్ సింగ్, ఇస్లాంపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్, పాలకవర్గం సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కల్పన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి సంఘీభావం



**మెదక్ జిల్లా -13ఏప్రిల్(మహాప్రభ**
తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జెఏసి పిలుపు మేరకు మెదక్ జిల్లా కేంద్రంలోని డివిజన్ కార్యాలయం ముందు గత 6 రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్న విద్యుత్ ఆర్టిజన్ ల సమ్మెకు సోమవారం రోజు మెదక్ మాజీ ఎమ్మెల్యే, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు పట్లోల్ల శశిధర్ రెడ్డి,మెదక్ పట్టణ బిఆర్ఎస్ నాయకులు మామిళ్ళ ఆంజనేయులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయనకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో జెఏసీ నాయకులు జంగం శరత్, పృథ్వి గౌడ్,ప్రదీప్ గౌడ్,నాగరాజు, వెంకటచారి,సూర్య రమేష్, బి.చంద్రబానప్ప,శ్రీశైలం,శ్రీనివాస్, మొగలయా,శంకరప్ప,మహిళా ఆర్టిజన్లు తదితరులు పాల్గొన్నారు.

# నో -హెల్మెట్..నో ఎంట్రీ

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**




**మెదక్ జిల్లా -13ఏప్రిల్ (మహాప్రభ )**
ప్రజా పాలనాబి ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా మెదక్ జిల్లాలో ఉన్న 492 గ్రామపంచాయతీలలో గ్రామ సభల ద్వారా అరైవ్‌బి అలైవ్ కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. .నిజం పేట మండలం నందగోకుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాలవర్గం ఏకగ్రీవ తీర్మానం మేరకు వినూత్నంగా నో ఎంట్రీ బినో హెల్మెంట్ నందగోకుల్ అనే కార్యక్రమనికి శ్రీకారం చుట్టారు...ఈ కార్యక్రమనికి మెదక్ కలెక్టర్ ప్రతీమా సింగ్, ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు ముఖ్య అతిధిగా హాజరుయ్యారు..వారికి గ్రామస్తులు పూలు చళ్ళుతు ఘన స్వాగతం పలికారు..అనంతరం హెల్మెంట్ లు పెట్టుకుని ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించరు..
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ప్రాణ రక్షణ ధ్యేయంగా నంద గోకుల్ గ్రామస్తులు చేసిన ఆలోచన బాగుందని జిల్లా ప్రజలు అందరు నందగోకుల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామ పంచాయతీలలో నో హెల్మెంట్ బినో ఎంట్రీ అనే కార్యక్రమన్ని చెపట్టాలని కలెక్టర్ సూచించారు... ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలంటే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. శిరస్త్రాణం (హెల్మెట్), సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదు అని సూచించారు. మెదక్ ఎస్పీ డి. వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,70,000 మంది రోడ్డు ప్రమాదాల ద్వారా మృతి చెందితే.. తెలంగాణలో 7000 మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.. మెదక్ జిల్లాలో హత్యలు అత్యాచారాలు మెదక్ జిల్లాలో సంవత్సరంలో 30 జరిగితే.. రోడ్డు ప్రమాదాల ద్వారా350 మరణాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు....రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం మద్యం సేవించి వాహనాలు నడపడం సీటు బెల్టు పెట్టుకోకపోవడం తదితర కారణాలవల్ల చాలామంది మృత్యువాత పడుతూ కుటుంబాలకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ నందగోకుల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని హెల్మెట్ ధరిస్తూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రతిజ్ఞ చేశారు... హెల్మెట్ వాడకం పై ఓ కానిస్టేబుల్ మిమిక్రీ అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ తాసిల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి దేవకుమార్ సర్పంచ్ పాతూరు భాను , ఎంపీడీవో రాజిరెడ్డి, సీఐ వెంకటరా రాజా గౌడ్, డీఎస్పీ నరేందర్ గౌడ్, సంబంధిత పోలీసు యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# ఎండల నుంచి ఉపశమనం...

**- కలెక్టరేట్‌లో అంబలి, చలివేంద్రం ప్రారంభం**




**కామారెడ్డి ఏప్రిల్ 13 (మహాప్రభ)**
వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు టీఎన్‌జీఓస్ (ంచీ+ూం) సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో అంబలి పంపిణీ కేంద్రం, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సందర్భంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలతో పాటు, రోజువారీగా వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే వారందరికీ ఉపయోగపడేలా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలంలో ప్రజలు తగినంత నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొంటూ టీఎన్‌జీఓస్ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు. ఈ కేంద్రం ద్వారా ప్రజలకు ఉచితంగా అంబలి, తాగునీరు అందజేశారు. వేసవి కాలమంతా ఈ సేవలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్‌కు టీఎన్‌జీఓస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి ఎం. నాగరాజు, సహాధ్యక్షుడు ఎం. చక్రధర్, కోశాధికారి ఎం. దేవరాజు, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రటరీలు రమణ కుమార్, రాజమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఈసీ సభ్యులు శ్రీకాంత్, సాయినాథ్, కామారెడ్డి అర్బన్ తాలూకా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షుడు ఎం. కిషన్ తదితరులు, సమీకృత జిల్లా కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు

# హెల్మెట్ తప్పనిసరి

**-నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాంతకం**
**-నంద గోకుల్ మెదక్ జిల్లాలో ఆదర్శ గ్రామం: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.**




**మెదక్ జిల్లా,-13ఏప్రిల్ (మహాప్రభ )**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఈ నెల 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిజాంపేట్ మండలంలోని మరుమూల గ్రామమైన నంద గోకుల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి వినూత్నంగా స్పందిస్తూ అతిథులకు స్వాగతం పలికారు. గ్రామంలో ద్విచక్ర వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొని అతిథులను ఆహ్వానించడం జరిగింది. హెల్మెట్ ప్రాణరక్షణలో ఎంత ముఖ్యమో గ్రామస్థులు ఈ ర్యాలీ ద్వారా చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని , నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న శాతం ఎక్కువగా ఉందని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు ఎవరూ అతీతులు కారని, నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలను తప్పించుకోలేమని తెలిపారు.
మరుమూల గ్రామమైన నంద గోకుల్‌లో ప్రతి ఒక్కరూ హెల్మెట్ కలిగి ఉండడం అభినందనీయమని గ్రామ ప్రజలను ప్రశంసించారు. ఈ గ్రామాన్ని మెదక్ జిల్లాలో ఆదర్శ గ్రామంగా కొనియాడారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే రూ.500 జరిమానా విధించాలని గ్రామ సభ తీర్మానించింది.
ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్, నిజాంపేట్ ఎస్ఐ రాజేష్, ఎంపీడీఓ రాజీ రెడ్డి , ఎంఆర్ఓ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ దేవ్ కుమార్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# 12 ఏళ్లుగా హెల్మెట్ అలవాటు...

**గ్రామానికి ఆదర్శంగా నిలిచినా రాములు.**



**మెదక్ జిల్లా -13ఏప్రిల్ (మహాప్రభ )**
నంద గోకుల్ గ్రామానికి చెందిన రాములు (80) అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా ద్విచక్ర వాహనం నడిపే ప్రతిసారి హెల్మెట్ ధరించడం ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న దూరం అయినా, పెద్ద ప్రయాణం అయినా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన నిరంతరం హెల్మెట్ వినియోగాన్ని కొనసాగిస్తున్నారు. రోడ్డు భద్రతపై ఆయన చూపుతున్న చిత్తశుద్ధి గ్రామస్థులకు ప్రేరణగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు రాములను అభినందించారు. హెల్మెట్ వినియోగంలో క్రమశిక్షణ పాటిస్తున్నందుకు శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ప్రాణరక్షణలో హెల్మెట్ కీలకమని, ప్రతి ఒక్కరూ రాములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇటువంటి వ్యక్తుల వలన సమాజంలో చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

# బిజినెస్

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 700 పాయింట్లు నష్టం



భారత స్టాక్ మార్కెట్ సోమవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 700 పాయింట్ల నష్టంతో ముగిసింది. ఉదయం ట్రేడింగ్ భారీ నష్టాలతో ప్రారంభం కాగా.. తర్వాత కొద్దిగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 702.68 పాయింట్ల (0.91 శాతం) నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 75,937.16 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. ఒక దశలో 1600 పాయింట్ల నష్టంతో 75,868.32 వద్ద కనిష్టాన్ని చేరుకుంది. తర్వాత కోలుకుని 702 పాయింట్ల నష్టంతో ముగిసింది. ఇక నిఫ్టీ కూడా భారీగా పతనమైంది. 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద ముగిసింది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధం వంటి అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగుదల వంటివి మార్కెట్‌కు భారీ నష్టాలు కలిగించాయి. పీఎస్‌యూ బ్యాంకులు, ఫైనాన్షియల్, బ్యాంకింగ్ స్టాక్స్ వంటివి సెల్లింగ్ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ వంటి కొన్ని స్టాక్స్ మాత్రమే లాభాల్ని చవిచూశాయి. టీసీఎస్, ఇండిగో, మారుతీ సుజుకీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ సంస్థల స్టాక్స్ నష్టపోయాయి. ఆటో స్టాక్స్ అత్యధిక నష్టాలు చవిచూశాయి. మరోవైపు రూపాయి విలువ పతనమైంది. డాలర్‌తో దాదాపు 56 పైసలు నష్టపోయిన రూపాయి 93.39 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 102 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక ఔన్స్ బంగారం ధర 4717 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## బంగారం ధరలు ఢమాల్..

### ఒక్కసారిగా భారీగా పతనం.. లేటెస్ట్ రేట్లు ఇవే..



**ఇంటర్నెట్ డెస్క్:**
గత వారం యూఎస్-ఇరాన్ కాల్పుల విరమణ ప్రకటన తరువాత భారత్‌లో బంగారం, వెండి ధరలు ఓ మోస్తరు స్థాయిలో పెరిగాయి. బంగారం సగటున రూ.2,800ల మేర పెరిగింది. గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగడంతో ఈ వారం ధరలు తీవ్రంగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం (ఏప్రిల్ 13) ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,40,090ల వద్ద కొనసాగుతోంది. కిలో వెండి రూ.2,64,900 పలుకుతోంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర గరిష్ఠంగా రూ.1,53,810ల వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా నగరాల్లో రూ.1,52,830గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,40,990గా, ముంబై, కోల్‌కతా నగరాల్లో రూ.1,40,090ల వద్ద కొనసాగుతోంది. ఇక చెన్నైలో కిలో వెండి ధర రూ.2,64,990గా ఉంది. ముంబైలో రూ.2,59,900ల వద్ద కొనసాగుతోంది. ఇతర నగరాల్లో కూడా వెండి ధర దాదాపు ఇదే రేంజ్‌లో కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర 4,677 డాలర్లుగా, ఔన్స్ వెండి ధర 73 డాలర్లుగా ఉంది.

## చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం : ట్రంప్ బెదిరింపులు



వాషింగ్టన్
: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.


### మహిళల టీ20 వరల్డ్‌కప్..

## 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ



**దుబాయ్:**
ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.

## కొత్త వివాదంలో చిక్కుకున్న యుజ్వేంద్ర చాహల్



టీమిండియా లెగ్ స్పిన్నర్, ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ తరఫున ఐపీఎల్ 2026లో ఆడుతున్న యుజ్వేంద్ర చాహల్ ఓ కొత్త వివాదంలో చిక్కుకున్నాడు. బోల్డ్ నటిగా పేరు తెచ్చుకున్న తానియా ఛటర్జీ.. చాహల్ తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పర్సనల్ మెసేజ్ పంపాడంటూ సంచలన ఆరోపణలు చేసింది. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన ఫోన్‌ను మీడియా ప్రతినిధులకు చూపిస్తూ.. చాహల్ తన ఫోటోకు స్పందిస్తూ .."ఆప్ క్యూట్ హో" (మీరు చాలా క్యూట్‌గా ఉన్నారు) అని మెసేజ్ చేసినట్లు పేర్కొంది. ఉల్లు, గందీ బాత్ వంటి ఓటీటీ సిరీస్‌ల ద్వారా పాపులర్ అయిన తానియా ఛటర్జీ.. ఈ విషయాన్ని కెమెరాల ముందు బయటపెట్టారు. చాహల్ పంపిన మెసేజ్ ను తాను చాలా ఆలస్యంగా చూశానని.. అందుకే చాహల్‌కు రిప్లై ఇవ్వలేదని తానియా వివరించారు. ఈ సమయంలో కెమెరామెన్లు ఆమెను ఆటపట్టిస్తుండగా.. తానియా సిగ్గుపడుతూ కనిపించారు. అయితే ఈ ఆరోపణలపై యుజ్వేంద్ర చాహల్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. ఈ వార్త బయటకు రాగానే నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొందరు యుజ్వేంద్ర చాహల్ ప్రవర్తనను తప్పుబడుతూ విమర్శలు గుప్పిస్తుంటే.. మరికొందరు మాత్రం ఇది కేవలం పబ్లిసిటీ కోసమే చేస్తున్న చౌకబారు పని అని కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతం ఏఐ కాలంలో ఇలాంటి ఫేక్ చాట్‌లు సృష్టించడం పెద్ద కష్టమేమీ కాదని.. వార్తల్లో నిలవడానికి నటి ఇలాంటి పనులు చేస్తోందని చాహల్ అభిమానులు మండిపడుతున్నారు. గతంలో ధనశ్రీ వర్మతో విడిపోయిన తర్వాత యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం తరచుగా వార్తల్లో నిలుస్తూనే ఉంది. వ్యక్తిగత జీవితంలో వివాదాలు ఉన్నప్పటికీ.. మైదానంలో యుజ్వేంద్ర చాహల్ పంజాబ్ కింగ్స్ తరఫున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు(224) తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన యుజ్వేంద్ర చాహల్‌ను పంజాబ్ కింగ్స్ రూ.18 కోట్లకు రీటైన్ చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ జట్టు ఈ సీజన్లో అద్భుతంగా రాణిస్తూ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. తన తదుపరి మ్యాచ్‌లో భాగంగా ఏప్రిల్ 16న వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్టుతో తలపడనుంది.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌కు ఎన్నికల సెగ.. ఆ రెండు మ్యాచ్‌ల షెడ్యూల్ మారింది..!



ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌కు మరోసారి ఎన్నికల సెగ తగిలింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా షెడ్యూల్‌ను ఆసల్యంగా ప్రకటించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈసారి మ్యాచ్ వేదికల్లో మార్పులు చేసింది. మాజీ ఛాంపియన్లు గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ వేదకలను మార్చింది. అహ్మదాబాద్‌తో పాటు గుజరాత్‌లోని పలు చోట్ల మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లు, ఉత్కంఠ పోరాటాలతో అలరిస్తున్న పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ షెడ్యూల్ మారనుంది. ప్లే ఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారిన వేళ.. కీలక మ్యాచ్‌ల వేదికలను మార్చింది బీసీసీఐ. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 26న .. అహ్మదాబాద్ స్టేడియంలో గుజరాత్ టైటన్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడాలి. అయితే.. గుజరాత్ వ్యాప్తంగా అదే రోజున మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున.. వేదికను చిదంబరం స్టేడియానికి మార్చింది బీసీసీఐ. చెపాక్ వేదికగా మధ్యాహ్నం 3:30 గంటలకు గుజరాత్, చెన్నై మ్యాచ్ జరుగనుంది. అలానే మే 21న చెన్నై సొంత మైదానంలో ఇరుజట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను అహ్మదాబాద్‌కు తరలించారు.




# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ – రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ – రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 – 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ – అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.



## చీరలో మెరిసిపోతున్న అందాల ఐశ్వర్య రాజేష్

# కండలు పెంచి.. కొత్త లుక్‌లో ఎన్టీఆర్

## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు




జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారని సమాచారం. తదుపరి షెడ్యూల్ కోసం భారీ సెట్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. తొలుత మలయాళ నటుడు టోవినో థామస్ ఈ పాత్రలో నటిస్తారని ప్రచారం జరిగింది. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్‌ని సంప్రదించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో రానున్నాయి. జూన్ 25న విడుదల చేయాలనే ప్రణాళికలో ఉన్నట్లు సమాచారం.



# హిట్ లేకున్నా శ్రీనిధికి బంపర్ ఆఫర్స్

సాధారణంగా సినీ పరిశ్రమలో ఒక సినిమా ఫ్లాప్ అయితే, ఆ నటీనటులకు కొత్త అవకాశాలు దక్కడం కష్టం. నిర్మాతలు కొత్త ప్రాజెక్ట్‌ల కోసం ఆలోచించడానికి వెనకాడుతారు. అయితే, బాక్స్ ఆఫీస్ వద్ద బోల్తా పడినప్పటికీ, కొందరు హీరోయిన్లకు మాత్రం అవకాశాలు ఏమాత్రం తగ్గడం లేదు. సక్సెస్ ట్రాక్ లేకపోయినా, స్టార్స్ మరియు డైరెక్టర్స్ వీరిని వరుసగా తమ చిత్రాలలో రిపీట్ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. ఈ జాబితాలో శ్రీనిధి శెట్టి ముందున్నారు. తెలుగులో హిట్ 3 విజయవంతమైన వెంటనే తెలుసు కథాతో ఫ్లాప్ వచ్చినప్పటికీ, ఈమెకు టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్లు క్యూ కడుతున్నాయి. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేష్ సరసన మెయిన్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నారు.


# మనసుకు నచ్చిందే చేస్తున్నానంటున్న తమన్నా



తమన్నా ఇప్పుడేం చేస్తున్నారు? పెద్దగా కనిపించడం లేదే.. అని సౌత్ ఆడియన్స్ అనుకునేలోపు... నేనొచ్చేశా అంటూ స్పెషల్ స్టేట్‌మెంట్స్ తో వార్తల్లో తళుక్కుమంటున్నారు మిల్కీబ్యూటీ. సినిమా తప్ప నాకు వేరే యావ లేదంటున్నారు. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన వాళ్లో, కావాలని స్పేస్ తీసుకుని మళ్లీ రీస్టార్ట్ చేసిన వాళ్లో... కెరీర్‌ని మళ్లీ ప్రారంభిస్తున్నట్టుగా ఉంది అని అంటారు. కానీ, ఇప్పుడు ఈ మాటను తమన్నా చెబుతున్నారు. సినిమా కెరీర్ స్టార్ట్ అయిన తర్వాత ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇన్‌స్టంట్‌గా వైరల్ అవుతోంది. నేను నటించిన సినిమాలన్నీ వరుసగా రిలీజ్ అవుతున్నాయి. ఏ నటికైనా కెరీర్ స్టార్ట్ అయిన 21 ఏళ్ల తర్వాత ఇంత బిజీగా ఉండటం అదృష్టం. నేను ఆ విషయంలో చాలా లక్కీ ఫెలో... దక్షిణాది పరిశ్రమలో నాకు లభిస్తున్న ఆదరణ చూసి ఆనందంగా ఉంది. అందుకే నేను కూడా సరికొత్త కథలకు, ప్రయోగాత్మక చిత్రాలకు నో చెప్పకుండా ఓకే చేస్తున్నా అని అంటున్నారు తమన్నా. ఎప్పటికప్పుడు కెరీర్‌ని షేప్ చేసుకోవడంలో తమన్నా సూపర్ సక్సెస్ అవుతున్నారన్నది క్రిటిక్స్ మాట. తమన్నా చెప్పినట్టే రెండు దశాబ్దాలుగా ఆమెను సౌత్ ఆడియన్సే ఆదరించారు.

# బాలయ్య--గోపీచంద్ మలినేని సినిమా సందడి..

## మ్యూజిక్ సిట్టింగ్స్ స్టార్ట్, రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ షూట్ ప్లాన్




నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్ తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు.ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య--నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య--గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com